# విదుషీమణి విజయభారతి కన్నుమూత

- ప్రముఖులు, సాహితీవేత్తల సంతాపం
- దళితచైతన్య రచనలు, తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా ఎనలేని సేవలు
- సంతాపం తెలిపిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ప్రముఖ రచయిత్రి, విదుషీమణి డాక్టర్ విజయభారతి అనారోగ్యంతో శనివారం కన్నుమూశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబీకులు శుక్రవారం ఉదయం సనత్‌నగర్‌లోని రెనోవా హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. విజయభారతి తండ్రి ప్రముఖ కవి, రచయిత బోయి భీమన్న. కాగా ఆమె న్యాయవాది, దివంతగత మానవ హక్కుల నేత బొజ్జా తారకంకు భార్య. విజయభారతి కుమారుడు రాహుల్ బొజ్జా ప్రస్తుతం సాగునీటి పారుదలశాఖ కారదర్శిగా ఉన్నారు. విజయభారతి కోరికమేరకు ఆమె భౌతికదేహాన్ని కుటుంబసభ్యులు ఆదివారం గాంధీ మెడికల్ కళాశాలకు అప్పగించనున్నారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురు ప్రముఖులు విజయభారతి మృతి పట్ల సంతాపం తెలిపారు.

### దళిత చైతన్య స్ఫూర్తి..

విజయభారతి రచయిత్రిగా, అనువాదకురాలిగా, తెలుగు సాహిత్య అకాడమీ డైరెక్టర్‌గా సామాజిక, సాహిత్యరంగాలకు ఎనలేని కృషి చేశారు. అంబేద్కర్ , జ్యోతిబా పూలేను అధ్యయనం చేశారు. ఆ ప్రభావంతోనే భారతీయ కుల వ్యవస్థ, స్వరూప స్వభావాల గురించి పురాణాలు, ఇతిహాసాల ఆధారంగా విశ్లేషణలు చేస్తూ అనేక రచనలు చేశారు. నరమేధాలు నియోగాలు.. పురాణాలు మరో చూపు వాటిలో ప్రసిద్ధమైనవి. అంబేద్కర్, పూలే జీవిత చరిత్రలను మొట్టమొదటిసారిగా తెలుగు సమాజానికి అందించిన ఘనత కూడా ఆమెకే దక్కుతుంది. వాటన్నింటినీ హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ప్రచురించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఆమెను పలు సాహిత్య అవార్డులు స్వీకరించారు. డాక్టర్ విజయభారతి 2013–2015 మధ్య సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అధ్యక్షురాలిగా కొనసాగారు. దళితుల హక్కుల కోసం కీలకంగా పనిచేశారు. పురణాల్లో దళిత స్త్రీల పాత్రలపై కూడా అనేక రచనలు చేశారు. ఇటీవలనే ఆమె రాసిన వ్యాస సంకలనం '75ఏళ్ల స్వతంత్ర భారతం స్త్రీలకు గుప్పెడు ధూళినే మిగిల్చిందా' అనే శీర్షికతో వెలువడింది. ఆత్మకథను కూడా రాసి ప్రచురణకు సిద్ధం చేసి ఉంచారు.

### ప్రముఖులు, సాహితీవేత్తల సంతాపం..

డాక్టర్ విజయభారతి మృతిపై ప్రముఖులు, సాహితీవేత్తలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సామాజిక రంగాలకు ఆమె చేసిన సేవలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. విదుషీమణి, మానవీయ కవయిత్రి, తెలుగునాట దళితచైతన్య జ్యోతికి చమురుపోసి వెలిగించారని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. అంబేద్కరిస్టు, పరిశోధకురాలు విజయభారతి మృతి సాహిత్యానికి తీరని లోటని, దళిత దృక్పథంలో నుంచి ప్రాచీన సాహిత్యాన్ని పునర్మూల్యాంకనం చేస్తూ విజయభారతి రాసిన విలువైన గ్రంథాలు అస్తిత్వ ఉద్యమాలకు కొత్త చూపును అందించాయని ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ కోయి కోటేశ్వరరావు శ్లాఘించారు. డాక్టర్ విజయభారతి సమాజసేవ, చేసిన కృషి, త్యాగం, రచనలు, తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్ మల్లెపల్లి లక్ష్మయ్య, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ కృష్ణ కొనియాడారు. విజయభారతి మరణం సాహిత్యరంగానికి తీరనిలోటని తెలంగాణ సాహిత్య పరిషత్ మాజీ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. ఆమె రచనలు అస్తిత్వ పోరాటానికి దిక్సూచిలా నిలిచాయని పేర్కొన్నారు.

### విజయభారతి మృతికి కేసీఆర్ నివాళి

డాక్టర్ విజయభారతి మరణం పట్ల మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. సాహిత్య, సామాజిక అధ్యయనశీలిగా విశ్లేషకులుగా డాక్టర్ విజయభారతి చేసిన కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. తెలుగు అకాడమీ డైరెక్టర్‌గా సేవలందించిన విజయభారతి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచనలు, ప్రసంగాల సంపుటాలకు సంపాదకురాలుగా, మహాత్మా జోతిరావు పూలే జీవిత చరిత్రను తెలుగు సమాజానికి మొట్టమొదటిసారి అందించిన రచయిత్రిగా ఆమె కృషి అమోఘమని ఆయన కొనియాడారు. శోక తప్తులైన వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# ఏఈవోల పెన్‌డౌన్?

- డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే చేయలేమని స్పష్టీకరణ
- సహాయకులు, ఇతర మార్గాలను చూడాలని విజ్ఞప్తి
- యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సర్కారు ఒత్తిడి
- రాష్ట్రంలోని 2,601మంది ఏఈవోల్లో ఆందోళన



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవోలు (ఫైల్)

కరీంనగర్,సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): డిజిటల్ క్రాప్ సర్వేపై రేవంత్ సర్కారు అనుసరిస్తున్న వైఖరిపై వ్యవసాయ విస్తరణాధికారులు భగ్గుమంటున్నారు. ఇప్పటికే 49రకాల విధులు నిర్వహిస్తూ.. అష్టకష్టాలు పడుతుండగా.. తాజాగా క్రాప్ సర్వే భారాన్ని మోపడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలో 2,601 ఏఈవోలు ఉంటే అందులో 60శాతం మహిళలే ఉన్నారని పేర్కొన్నారు. క్రాప్ సర్వే యాప్‌ను వ్యక్తిగత సెల్‌ఫోన్‌లో అప్‌లోడ్ చేయమంటున్నారని, తద్వారా తమ వ్యక్తిగత సమాచారం యాప్ కంపెనీలకు వెళ్తుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. మంత్రులు, అధికారులకు మొరపెట్టుకోగా.. స్పందన కరవైంది. దీంతో పెన్‌డౌన్ సమ్మెవైపు వారు కార్యచరణ రూపొందిస్తున్నారు.

### సర్వే..ఓ ప్రహసనం

దేశవ్యాప్తంగా పంటల బీమా, ఆహార భద్రత, పంటల వివరాల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల పంట నష్టాలు, పంటల ఉత్పత్తులకు అనుగుణంగా ఎగుమతులు, దిగుమతులు, మార్కెటింగ్‌పై దృష్టి వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని.. కేంద్ర ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేకు రెండేండ్ల క్రితం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం.. వ్యవసాయ రంగంలో డీపీఐని రూపొందించే లక్ష్యంతో 'డిజిటల్ అగ్రి మిషన్' పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. దీనికోసం రూ.2,817 కోట్లు వెచ్చిస్తోంది. ఈ సర్వేను ఈ నెల 27 నుంచి చేయాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ సర్వేకు రాష్ట్రంలో 18 మండలాలను ఎంపిక చేశారు. ఇందులో కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం ఒకటి. ఇక్కడ పనిచేసే నలుగురు ఏఈవోలతో సర్వే కాదని గుర్తించి.. మరో 23 మంది ఏఈవోలను డిప్యూటేషన్ చేశారు. ఒక్క మండలం సర్వే చేయడానికి రెండున్నర నెలలు పట్టింది. 18 మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,601 మంది ఏఈవోలు ఉన్నారు. రాష్ట్రం మొత్తం డిజిటల్ క్రాప్ సర్వే చేయాలంటే.. ఒక్కో ఏఈవో సగటున ఒక సీజన్‌లో 32 వేల ఫారమ్స్‌లో సర్వే నిర్వహించాల్సి ఉంటుంది. 20 మీటర్ల దూరం నుంచి మాత్రమే సదరు సర్వేనంబర్‌లోని పంటల ఫొటోలను క్యాప్చర్ చేసి అప్‌లోడ్ చేయవచ్చు. నెట్ పనిచేయకపోయినా, సాంకేతిక ఇబ్బందులున్నా... ఏమీ చేయలేని దుస్థితి. రాష్ట్రంలోని ఏఈవోల్లో 60 శాతం మహిళలే ఉన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద ఒక మండలాన్ని 30 మంది ఏఈవోలు కలిసి సర్వే చేస్తేనే రెండున్నర నెలలు పట్టినప్పుడు ప్రస్తుతం మండలంలో నలుగురు కలిసి ఎలా చేస్తారన్న ప్రశ్నను తెరపైకి తెస్తున్నారు.

### ఇతర రాష్ట్రాల్లో భిన్న మార్గాల్లో..

ఆయా రాష్టాల్లో వ్యవసాయ శాఖ సూపర్‌వైజర్‌గా మాత్రమే పనిచేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఇందుకోసం గ్రామ సహాయకులను నియమించారు. వారికి కేంద్ర నిధుల నుంచి గౌరవభృతి చెల్లిస్తున్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం టాటా కన్సల్టెన్సీలకు సర్వే అప్పగించింది. కర్ణాటక, కేరళ, ఒడిశా, పశ్చిమబంగా రాష్ట్రాలు నోడల్ ఏజెన్సీలతో సర్వే చేయిస్తున్నాయి. తమిళనాడులో రెవెన్యూకు అప్పగించారు. మధ్యప్రదేశ్‌లో ఓ స్వచ్ఛంద సంస్థతో సర్వే చేయిస్తున్నారు. రాష్ట్రంలో యాప్ డౌన్‌లోడ్ చేయని ఏఈవోలను సెలవుగా పరిణించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఇతర రాష్ట్రాల్లో సర్వే కోసం ఒక్కో ఫారమ్స్‌కు రూ.15 చెల్లిస్తుండగా, మన రాష్ట్రంలో రూ.2 చొప్పున చెల్లించారు.

### విజ్ఞప్తులు చేసి.. పెన్‌డౌన్ వైపు అడుగులు

డిజిటల్ క్రాప్ బుకింగ్ సర్వే సాధ్యం కాదని, ఏపీలో మాదిరిగా సహాయకులను నియమించాలని, ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా వివిధ మార్గాల్లో సర్వే చేయించాలని కోరుతూ.. వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఈవోలు మంత్రులు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇస్తున్నారు. వ్యవసాయశాఖలో క్షేత్రస్థాయి అధికారి నుంచి మొదలు పైస్థాయి అధికారి వరకు.. కలిసి మొర పెట్టుకున్నారు. శనివారం తెలంగాణ వ్యవసాయ విస్తరణ అధికారుల సెంట్రల్ ఫోరం కార్యవర్గ సమావేశాన్ని నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. ఏఈవో రాష్ట్ర అధ్యక్షుడు డీ శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేశ్‌రెడ్డి, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు. ఏఈవోల సమస్యలపై టీఎన్జీవో కేంద్రసంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారం జగదీశ్వర్, ముజీబ్ హుస్సేనీ మద్దతు ప్రకటించారు. ఈ పరిస్థితులన్నింటినీ పరిగణలోకి తీసుకున్న ఏఈవోల సంఘం.. రెండు రోజుల సమయం ఇచ్చి.. ఈ వ్యవహారంపై ప్రభుత్వం స్పందించకపోతే పెన్‌డౌన్ సమ్మెకు వెళ్లాలని నిర్ణయించుకుంది. సోమవారం ప్రభుత్వ ప్రధానకార్యదర్శిని కలిసి మరోసారి విజ్ఞప్తి చేస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే పెన్‌డౌన్ సమ్మె ఒక్కటే తమ ముందున్న మార్గం అని నిర్ణయానికి వచ్చినట్టు తెలిపారు.

## కాలమ్-5 సవరించాలి: సీపీఎం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో కాలమ్ నంబర్-5ను సవరించాలనిక కోరుతూ రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ (సీఈవో)ను శనివారం బీఆర్కేభవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీజీ నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు బాబూరావు వినతి పత్రం అందజేశారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ, కరీంనగర్-మెదక్-నిజామాబాద్-ఆదిలాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గాలకు అక్టోబర్ 1 నుంచి ఓటర్ల నమోదు ప్రారంభమవుతున్నదని గుర్తుచేశారు. ఓటర్ల జాబితాలోని కాలమ్ నంబర్-5లో విద్యాసంస్థ పేరు, మండలం, జిల్లా తదితర పూర్తి పోస్టల్ అడ్రస్‌ను ప్రచురించాలని సూచించారు.



## మెట్రో డీలక్స్ బస్సుల్లో సిబ్బందికి నో ఎంట్రీ

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కొత్తగా ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ బస్సుల్లో ఆర్టీసీ సిబ్బంది ప్రయాణించవద్దని టీజీఎస్ ఆర్టీసీ ఆదేశించింది. 'స్టాఫ్ నాట్ అలోడ్' అనే స్టిక్కర్లు అంటించింది. 'మహిళలు, పాత్రికేయులకు, బడి పిల్లలకు, ఎస్కార్ట్ పోలీసులకు, స్వాతంత్ర సమరయోధులకు, ఎయిడ్స్, డయాలసిస్ పేషంట్లకు, పోలీస్ అమరవీరుల సతీమణులకు, ఎస్కార్ట్, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నది. అనేక మందికి 50 శాతం రాయితీలు ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తున్నది. సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు మాత్రం ఉచిత రవాణా సౌకర్యం లేకపోవడం దురదృష్టకరం' అని ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన మెట్రో డీలక్స్ సర్వీసుల్లో ఆర్టీసీ సిబ్బందికి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించకపోవడం సరికాదని నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కమల్‌రెడ్డి మండిపడ్డారు. ఈ అంశంపై ఆర్టీసీ పునః పరిశీలించాలని సూచించారు.

# కామారెడ్డి డిక్లరేషన్ అమలుచేయాలి

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్
- కల్వకుర్తిలో బీసీల మహాధర్నా



కల్వకుర్తిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో పల్లె రవికుమార్, నాయకులు

కల్వకుర్తి రూరల్, సెప్టెంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ఇచ్చిన డిక్లరేషన్ ప్రకారం.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలో కొమ్ము శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆర్‌ఎస్ ప్రవీణ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలను కేవలం ఓటు బ్యాంకు కోసం వాడుకుంటున్నారని, వారు రాజకీయ సాధికారతతోనే అభివృద్ధి సాధించగలుగుతారని తెలిపారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణ చివరి ఓసీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డియేనని అన్నారు. రాబోయే కాలంలో బీసీలదే హవా కొనసాగనున్నదని చెప్పారు. బీసీలకు రిజర్వేషన్ అమలు చేసేలా తాను కాంగ్రెస్ అధిష్ఠానంతో మాట్లాడుతానని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రవికుమార్‌గౌడ్, ఉప్పల వెంకటేశ్, జంగయ్య, రవికుమార్ ఉష, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## రుణమాఫీ చేయకుంటే తిరగబడుతాం

- ఎమ్మెల్యే మందుల సామేల్‌కు రైతుల హెచ్చరిక

అడ్డగూడూరు, సెప్టెంబర్ 28: రూ.2 లక్షల రుణమాఫీ చేయకుంటే తిరగబడుతామని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను రైతులు హెచ్చరించారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరులో విండో కార్యాలయంలో నిర్వహించిన పీఏసీఎస్ సర్వసభ్య సమావేశానికి హాజరైన తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్.. సీఎం రేవంత్‌రెడ్డి పాలన ఎలా ఉందని రైతులను అడిగారు. మండల కేంద్రానికి చెందిన రైతు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షలపై ఉన్న రైతులు ఆ డబ్బులను బ్యాంకులకు చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. వెంటనే అక్కడున్న రైతులు రూ.2 లక్షల పైన ఉన్న డబ్బులు అప్పుడే కట్టామని తెలుపడంతో కొంచెం సమయం పడుతుంది చెప్పారు. విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి రూ.1.50 కోట్లు వస్తే తమ సంఘం పరిధిలోని రైతులందరికీ మాఫీ వర్తిస్తుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా.. వెంటనే డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి అడ్డగూడూరు సింగిల్ విండోకు రూ.1.50 కోట్లు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన వచ్చే నెల 3 తర్వాత మంజూరు చేస్తానని సమాధానమిచ్చారు.

## అసంపూర్తిగా రుణమాఫీ

- పార్టీ ఫిరాయింపులను ఎలా ప్రోత్సహిస్తారు?
- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల హామీల్లో ఇచ్చిన రైతు రుణమాఫీని అసంపూర్తిగా చేసిందని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కౌన్సిల్ అభిప్రాయపడింది. శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మొదటి సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానం ప్రవేశపెట్టారు. కాంగ్రెస్ హామీలను సంపూర్ణంగా అమలు చేయాలని కోరుతూ అక్టోబర్ 21న అజాద్ హింద్ దివస్ పార్టీ తరపున కార్యాచరణ చేపట్టాలని తీర్మానించినట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి చెప్పారు. గతంలో పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రోత్సహించడం రాహుల్‌గాంధీ ఆశయాలకు, ఇండియా బ్లాక్ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా ఉన్నాయని రాష్ట్ర కౌన్సిల్ అభిప్రాయపడింది.

# రోడ్లకు రాజకీయ గ్రహణం!

- నిధులు లేక చేతులెత్తేసిన రాష్ట్ర సర్కారు
- మీకిస్తే మాకేంటి అనే ధోరణిలో కేంద్రం
- ఇరుకు రోడ్లతో ప్రజలకు తీవ్ర అవస్థలు
- అప్‌గ్రేడ్ చేసేందుకు కేంద్రం ససేమిరా
- ఏండ్లుగా పెండింగులోనే ప్రతిపాదనలు



హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని రోడ్లకు రాజకీయ గ్రహణం పట్టుకున్నది. పెరిగిన ట్రాఫిక్ అవసరాలకు తగ్గట్టుగా రోడ్లను అప్‌గ్రేడ్ చేయకపోవడంతో ఇరుకు రోడ్లతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను రాజకీయ కోణంలో ఆలోచిస్తుండటమే ఇందుకు కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాలకు అనుసంధానంగా కొనసాగుతున్న 16 రోడ్లు కాలక్రమంలో ట్రాఫిక్ పెరగడం వల్ల ఇరుకు రోడ్లుగా మారిపోయాయి. ఇందులో ప్రధానంగా పారిశ్రామికవాడలు, పర్యాటక స్థలాలు, అంతర్రాష్ట్ర రోడ్లు, జిల్లా కేంద్రాలను అనుసంధానం చేసే రోడ్లు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో కొన్ని సింగిల్ రోడ్లుగా, మరికొన్ని డబుల్ రోడ్లుగా ఉన్నాయి. సుమారు 1,617 కిలోమీటర్ల పొడవున ఉన్న ఈ రోడ్లపై నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. గత కేసీఆర్ సర్కారు ఈ రోడ్లను అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రణాళికలు రచించి కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించింది. రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకొని వీటిని వెంటనే నాలుగు లేన్ల రోడ్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరింది. కేంద్రం నుంచి స్పందన రాలేదు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోనే వీటిని అప్‌గ్రేడ్ చేయాలని భావించారు. ఈలోగా రాష్ట్రంలో ఎన్నికలు జరగడం, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. గత తొమ్మిది నెలల్లో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మూడు సార్లు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి విజ్ఞప్తి చేసినా సానుకూల ఫలితం రాలేదు. కనీసం దశలవారీగానైనా మంజూరు చేయాలని కోరినా ఇంతవరకు ఒక్క రోడ్డుకు కూడా మోక్షం లభించలేదు.

### నిధులు లేవని వీరు.. మీకిస్తే మాకేంటి అని వారు..

రాష్ట్రాల్లో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా రోడ్ నెట్‌వర్క్‌ను అప్‌గ్రేడ్ చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉన్నది. ప్రాధాన్యాలకు అనుగుణంగా వాటిని జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలి. కేంద్రంలోని బీజేపీ సర్కారు రాజకీయ కోణంలో ఆలోచిస్తూ తెలంగాణ ప్రతిపాదనలను పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపించిందనే వాదనలూ లేకపోలేదు. తెలంగాణకు మేలు చేస్తే తమకు ఒనగూరే ప్రయోజనం ఏమిటి? మేలు చేయకుంటే వచ్చే నష్టం ఏమిటి? ఒకవేళ తెలంగాణలో రోడ్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసినా ఆ క్రెడిట్ రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుంది కదా... అనే ధోరణితో కేంద్రం ఉన్నట్టు అధికారవర్గాలు కూడా అభిప్రాయపడుతున్నాయి. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కూడా రోడ్ల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చించకుండా సాధ్యమైనంత మేరకు కేంద్రం నుంచి నిధులు, ప్రాజక్టులు రాబట్టాలనే ప్రణాళికలతో ముందుకు సాగుతున్నది.

### అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదిత రోడ్ల వివరాలు

- జగిత్యాల-కాటారం (130 కి.మీ.)
- దిండి-నల్లగొండ (100 కి.మీ.)
- భువనగిరి-చిట్యాల (44 కి.మీ)
- చౌటుప్పల్ -సంగారెడ్డి (182 కి.మీ)
- మరికల్ -రామసముద్రం (63 కి.మీ.)
- వనపర్తి-మంత్రాలయం (110 కి.మీ.)
- మన్నెగూడ-బీదర్ (134 కి.మీ.)
- కరీంనగర్-పిట్లం (165 కి.మీ.)
- ఎర్రవెల్లి క్రాస్‌రోడ్-రాయచూర్ (67 కి.మీ)
- కొత్తపల్లి-దుద్దెడ (75 కి.మీ.)
- సారపాక -ఏటూరునాగారం (93 కి.మీ.)
- దుద్దెడ-రాయగిరి క్రాస్‌రోడ్ (63 కి.మీ.)
- జగ్గయ్యపేట-కొత్తగూడెం (100 కి.మీ.)
- సిరిసిల్ల-కోరుట్ల (65 కి.మీ.)
- భూత్పూర్-సిరిగిరిపాడు (166 కి.మీ.)
- కరీంనగర్-రాయపట్నం(60 కి.మీ.)

## ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ !

హైదరాబాద్, సెప్టెంబర్28 (నమస్తే తెలంగాణ): ఎస్సీ వర్గీకరణ అంశంపై ఏకసభ్య జ్యుడీషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని సర్కారు యోచిస్తున్నది. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పును వెలువరించిన నేపథ్యంలో తగిన సిఫారసులు చేసేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్‌కమిటీని నియమించింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చైర్మన్‌గా కమిటీ శనివారం సచివాలయంలో మరోసారి భేటీ అయ్యింది. పంజాబ్, హర్యానా, తమిళనాడు సర్కార్లు ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ అంశంపై చర్చించి, అదే తరహాలో రాష్ట్రంలోనూ అమలు చేయాలని నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తున్నది. 2011 జనాభా లెక్కలనే పరిగణనలోకి తీసుకోవాలని సమాలోచనలు చేసినట్టు సమాచారం. 1999 నుంచి 2004 వరకు జరిగిన ఎన్నికల్లో ఉపకులలాలకు ఏ మేరకు లబ్ధి జరిగిందనే అంశంపై కూడా చర్చించినట్టు తెలిసింది. ఈ మొత్తం అంశాలపై చర్చించేందుకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ కావాలని ఉపసంఘం నిర్ణయించినట్టు సమాచారం.



రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి అశోక్

## ఆసరా పింఛన్‌తో రోడ్ల మరమ్మతు

- రూ.20 చొప్పన విరాళం ఇచ్చిన వృద్ధులు
- 2 వేలు పోగేసి పనులు చేయించిన పంచాయతీ కార్యదర్శి
- రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం పోతుగల్‌లో ఘటన

చేవెళ్ల రూరల్, సెప్టెంబర్ 28: రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధి పోతుగల్ గ్రామంలోని షాద్‌నగర్–చేవెళ్ల హైవేపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు వృద్ధులు ముందుకొచ్చారు. గ్రామానికి చెందిన 200 మంది పింఛన్ దారులు (వృద్ధులు) రూ.20 చొప్పున రూ.2 వేలు పోగేసి పంచాయతీ కార్యదర్శి అశోక్‌కు అందజేశారు. ఈ డబ్బులతో కార్యదర్శి శనివారం గ్రామ పంచాయతీ సిబ్బందితో కలిసి రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

## చార్జీల పెంపుపై కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ): ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్‌కు సంబంధించి మండీ లేబర్ చార్జీల పెంపుపై ప్రభుత్వం శనివారం కమిటీ వేసింది. సివిల్‌సప్లై కమిషనర్ చౌహాన్ చైర్మన్‌గా, ఎఫ్‌సీఐ చెన్నై ఈడీ, ఎఫ్‌సీఐ రీజియన్ జీఎం, రాష్ట్ర మండీ బోర్డ్ చైర్మన్, గిడ్డంగుల సంస్థ ఎండీ, కేంద్ర గిడ్డంగుల సంస్థ ఆర్ఎం, వ్యవసాయ శాఖ డైరెక్టర్, కార్మికశాఖ ప్రతినిధి, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ సభ్యులుగా ఉండనున్నారు.

## లోక్‌అదాలత్‌లో 9.87 లక్షల కేసులు పరిష్కారం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా అన్ని కోర్టుల్లో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 9,87,065 కేసులు పరిష్కారమైనట్టు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వెల్లడించింది.

## 'యాదాద్రి' స్వర్ణతాపడంపై రెండు కమిటీలు

- వచ్చే బ్రహ్మోత్సవాలకు పూర్తిచేయాలని ఆదేశం
- స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి పనుల అప్పగింత

హైదరాబాద్, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాదాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ విమాన గోపురానికి బంగారు తాపడం చేయించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి పనులు అప్పగించిన ప్రభుత్వం.. వచ్చే ఏడాది జరుగనున్న బ్రహ్మోత్సవాలకు, అంటే మార్చి 2025 నాటికి పూర్తి చేయాలని సంకల్పించింది. పనుల పర్యవేక్షణతోపాటు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం రెండు కమిటీలను ఏర్పాటుచేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. పనులను వెంటనే ప్రారంభించి గడువులోగా పూర్తిచేయాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.

### స్వర్ణతాపడానికి 65 కోట్ల అంచనా..

గత కేసీఆర్ సర్కారు 125 కిలోల మేలిమి బంగారంతో విమానగోపురానికి స్వర్ణతాపడం చేయాలని నిర్ణయించింది. స్వయంగా కేసీఆర్ కేజీ 16 తులాల బంగారాన్ని విరాళంగా అందజేశారు. స్వర్ణతాపడానికి రూ.65 కోట్లు ఖర్చవుతుందని అప్పట్లో అంచనా వేయగా, దాతల నుంచి 10 కిలోలకు పైగా బంగారం, రూ.30 కోట్లకు పైగా నగదు సమకూరింది.

### భద్రాద్రిలో భూసేకరణకు ఉత్తర్వులు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధి, విస్తరణ నిమిత్తం భూసేకరణకు అనుమతులు మంజూరు చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులిచ్చింది. గత కేసీఆర్ ప్రభుత్వం భద్రాద్రి ఆలయ అభివృద్ధికి అప్పట్లో రూ.100కోట్లు మంజూరు చేసింది. అనంతరం ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగలేదు.

## సిరిసిల్ల ఆర్డీవో ఆఫీస్‌లో విజిలెన్స్ తనిఖీలు!

### రేషన్ డీలర్ల నియామకంలో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): రాజన్న సిరిసిల్ల జిల్లాలో రేషన్ డీలర్ల నియామకంలో అవినీతి అక్రమాలు జరిగాయని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులు మరోసారి శనివారం తనిఖీలు చేపట్టినట్టు తెలిసింది. ఈ విషయంలో ఇప్పటికే ప్రభుత్వం విచారణకు ఆదేశించినట్టు సమాచారం. కాగా రెండు రోజుల క్రితం సివిల్ సప్లయీస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సిరిసిల్లకు వచ్చి ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. తాజాగా, శనివారం కూడా సుమారు రెండు గంటలపాటు రికార్డులను పరిశీలించి, అధికారులను విచారించినట్టు తెలిసింది. జిల్లాలో పదేండ్ల కిందట మహిళా సంఘాలకు 17 దుకాణాలను అప్పటి ప్రభుత్వం కేటాయించింది. ఆర్థిక పరిపుష్టి సాధించడంతోపాటు పేదలకు బియ్యం పంపిణీలో పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో మహిళలను రేషన్ డీలర్లుగా నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, స్థానిక నేతలు వాటిని రద్దు చేయించి, కొత్తగా ఖాళీ అయిన వాటితో కలుపుకొని మొత్తం 58 దుకాణాలకు నోటిఫికేషన్ వేయించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో అధికారులు.. కొనసాగుతున్న డీలర్‌షిప్‌లను రద్దు చేసి ఇటీవల రాతపరీక్షలు, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. రద్దు చేసిన 17 దుకాణాల్లో రెండింటిని వదిలి 15 దుకాణాలను కొత్తవారికి కేటాయించారు. రాతపరీక్షకు 830 మంది దరఖాస్తు చేసుకోగా, 765 మంది పరీక్షలు రాశారు. పరీక్షలు నిర్వహించిన అధికారులు పేపర్లమీద ఇన్విజిలేటర్ల సంతకాలు తీసుకోలేదని, మార్కుల జాబితా బోర్డుపై ప్రదర్శించకుండానే అభ్యర్థులను ఎంపిక చేశారంటూ విమర్శలు వచ్చాయి.

## విద్యార్థినులతో హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన ..కేసు

వైరా రూరల్, సెప్టెంబర్ 28 : విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ హెచ్‌ఎం ఉదంతం ఖమ్మం జిల్లా వైరా మండలంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పాలడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చావా శ్రీనివాసరావు కొంత కాలంగా 8, 9, 10వ తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతోపాటు వారిని బూతులు తిడుతున్నాడు. విద్యార్థినులు తల్లిదండ్రులకు చెప్పడంతో గ్రామస్థులతో కలిసి శనివారం పాఠశాల వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆందోళన చేస్తారనే విషయాన్ని ముందుగానే పసిగట్టిన హెచ్‌ఎం శ్రీనివాసరావు పాఠశాల నుంచి తప్పించుకున్నాడు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు వచ్చి కార్యాలయంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతుండగా ఆందోళనకారులు గదికి తాళం వేశారు. అంతటితో ఆగకుండా ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దీంతో డీఈవో సోమశేఖర శర్మ, సీఐ నూనావత్ సాగర్ పాఠశాలకు చేరుకొని తల్లిదండ్రులకు నచ్చజెప్పి.. గదిలో నిర్బంధించిన ఎంఈవో, ఉపాధ్యాయులను బయటకు తీసుకొచ్చారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేయగా, విచారణ చేపట్టి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో హామీ ఇచ్చారు. ఫిర్యాదు స్వీకరించిన సీఐ సాగర్ హెచ్‌ఎంపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు.